


# నవభూమి వరంగల్

అనుబంధం

09 సెప్టెంబర్,2024 సోమవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


# వర్షాలకు రాలుతోంది



**మోత్కూరు, -నవభూమి:** అదనుతప్పి కురుస్తున్న వర్షాలతో రైతన్న ఆగమవుతున్నాడు. జిల్లాలో ప్రధానంగా సాగయ్యేది వరి, పత్తి పంటలే. ఈఏడాది వర్షాకాలం ప్రారంభమై రెండున్నర మాసాలు గడిచాక,ఈ నెల లో కురిసిన వర్షాలు మినహా అంతకు ముందుకు భారీ వానలే లేవు. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేయగా, జిలాల్లో ప్రధానంగా మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), గుండాల తదిత ర మండల్లాలో నేటికీ చెరువులు, కుంటల్లోకి నీరు రాలేదు. బిక్కేరువాగులో నూ నీరు ప్రవహించలేదు. జిల్లాలో చెప్పుకోదగిన ప్రాజెక్టులు లేకపోవడం తో వర్షాధారంపైనే పంటలు సాగవుతున్నాయి. మెట్టపంటలతోపాటు చెరువులు, కుంటలు, బావులు, బోర్లపై ఆధారపడి రైతులు వరిసాగు చేస్తున్నా రు. నేటికీ చెరువులు, కుంటలు నిండకపోవడంతో బావులు, బోర్లలో భూ గర్భ జలాలు పెరగలేదు. దీంతో వరినాట్లు వేయలేకపోవడంతో నార్లు ముదురుతున్నాయి. వచ్చిపోయే చినుకులకు మడులు తడిపి, దున్ని నాటువేసినా ఆ తర్వాత ఎండలకు ఎండిపోతున్నాయి. అదును ప్రకారం వర్షాలు లేక పత్తి, కంది చేలు కుంటుపడ్డాయి. ఈ వర్షాలు పత్తి చేలకు జీవం పోసినా, గూడ (మొగ్గ) రాలి నష్టాన్ని కలిగిస్తున్నాయి.గూడ రాలుతున్న పత్తి జిల్లాలో 1.04లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. జూలైలో భారీ వర్షాలు లేక, భూమి లోతుగా తడవక పత్తి చేలు వాడి అంతగా ఎదుగుదల లేదు. పత్తి మొలకెత్తిన మూడు మాసాల్లోనే పూర్తిగా ఎదగాలి. అప్పుడే సరైన దిగుబడి వస్తుంది. ఆగస్టులోనూ సరైన వర్షాలు లేక మరో సారి పత్తి చేలు వాడిపోయాయి. చేలు పూత, కాత దశలో ఉన్నాయి. ఆగస్టులో వర్షాలు లేక వాడిపోయిన చేలకు ఇటీవల కురిసిన వర్షాలు జీవం పోసినప్పటికీ గూడ (మొగ్గ) విపరీతంగా రాలిందని పత్తి రైతులు ఆవేదన చెందుతున్నారు. గూడ రాలడంతో 15 నుంచి 20శాతం దిగుబడి తగ్గుతుందని, పత్తి చేలకు తెగుళ్లు కూడా సోకుతున్నాయి, మందులు పిచికారీ చేసినా అదుపులోకి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వరి పంటను దెబ్బతీస్తున్న గొట్టం రోగం జిల్లాలో ఇప్పటికీ వరినాట్లు 70శాతం కూడా పూర్తికాలేదు. రైతులు ఇంకా వరినాట్లు వేస్తూనే ఉన్నారు. వచ్చిపోయే చినుకులకు రోజుకో మడి చొప్పున తడిపి, దున్ని నాటు వేయగా వర్షాలు లేక ఎండలు వచ్చినప్పుడు బావులు, బోర్ల నుంచి నీరు అందక వేసిన నాట్లు ఎండిపోతున్నాయి. ఎండిపోగా మిగిలిన వరి నాట్లకు కూడా గొట్టం రోగం సోకి వరి చేలు ఎర్రబారుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వరి, మెట్ట పంటల సాగు ఏమాత్రం లాభసాటిగా లేదంటున్నారు. గూడ రాలిన పత్తి చేలకు ప్రభుత్వం ఇన్‌ఫుట్ సబ్సిడీ కింద ఉచితంగా ఎరువులు, క్రిమిసంహారక మందులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.పంటలు దెబ్బతింటున్నాయి : మర్రి మధు, రైతు మోత్కూరు నాకున్న భూమితో పాటు ఇతరుల భూమి కౌలుకు తీసుకుని 20 ఎకరాల్లో పత్తి సాగు చేశా. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి చేలల్లో 20శాతం గూడ రాలింది. గతంలో నాన్ బీటీ పత్తి కావడంతో నెలల తరబడి దిగుబడి వచ్చేది. ఇప్పుడు బీటీ పత్తి కావడంతో మొదట మైల పత్తి ఏరిన తర్వాత మరో రెండు, మూడు సార్లు ఏరితే పత్తి దిగుబడి ముగుస్తుంది. ఈ వర్షాలకు గూడ రాలడంతో దిగుబడి 20శాతం తగ్గినట్టే. ఏడు ఎకరాలు వరి నాటు వేయగా, రెండు ఎకరాల నాటు ఎండింది. వర్షాకాలమే అయినా నీళ్లు అందక బావి మళ్లీ పూడిక తవ్విస్తున్నా. గూడ రాల్చిన పత్తి చేలకు ఇన్‌ఫుట్ సబ్సిడీ కింద ఉచితంగా ఎరువులు, క్రిమి సంహారక మందులు అందించి ప్రభుత్వం ఆదుకోవాలి.

# జిల్లాలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి

# ప్రకటించాలి

◆ జయశంకర్ భూపాలపల్లి జిల్లా డివైఎఫ్ఐ కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్



**కాటారం,సెప్టెంబర్ 8 నవభూమి ప్రతినిధి:**భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని జిల్లా కమిటీ పిలుపులో భాగంగా శు క్రవారం రోజున కాటారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక కు వినతి పత్రం అందజేసారు.ఈ సందర్భంగా ఆత్కూరు శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు, దోమ కాటు వల్ల వచ్చే డెంగ్యూ ఇతరత్రా మలేరియా లాంటి విష జ్వరాలు ప్రబలిస్తుండడం వల్ల ప్రజలు ఆరోగ్య ఆర్థిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురి అవు తున్నారన్నారని,దీని వలన వెనుకబడిన తరగతుల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందని పసిపిల్లల నుంచి ముసలి వాళ్ళ వరకు విష జ్వరాలు విస్తృతంగా వ్యాపిస్తున్నాయని అటు ప్రైవేట్ హాస్పటల్లో పోయే ఆర్థిక స్థోమత లేక అనేక రకాలుగా ఒత్తిడీ లకు సామాన్య కుటుంబాలు లోను అవుతున్నాయి.కావున ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా వర్షాకాలం దాని ప్రభావం దృష్ట్యా తక్షణమే జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ప్రభుత్వ వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు ప్రాణనష్టం,ఆర్థిక నష్టం జరగకముందే కాపాడుకునే ప్రయత్నం చేసే ప్రయత్నంలో భాగంగా ప్రజల్ని కాపాడేందుకు తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని జిల్లా వైద్య శాఖ అధికారులను కోరినట్లు శ్రీకాంత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి,శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.



## కాటారం మండలంలో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు





## భూదాన్ పోచంపల్లి వాడ వాడల కొలువుతీరిన గణనాథులు

# మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

### వినాయక చవితి పండుగ రోజున ఉచిత మట్టి గణపతుల పంపిణీ




**కాటారం,సెప్టెంబర్ 8 నవభూమి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో శ్రీ రామ ట్రేడర్స్ షాప్ ముందు స్వయంకృషి స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యములో శ్రీనివాస రెడ్డి సహకారంతో పర్యావరణ పరిరక్షణ కొరకు ఉచిత మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.గారెపల్లి చౌరస్తా అంబేద్కర్ కూడలిలో సింగిరెడ్డి మదూకర్ ఆద్వర్యంలో మట్టి గణపతి నే పూజిద్దాం అనే నినాదం తో మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకుడు కొట్టే సతీష్,స్వచ్ఛంధ సంస్థ సభ్యులు,సింగిరెడ్డి మదూకర్ రెడ్డి, బండం బాపురెడ్డి,అల్లూరి రవీందర్ రెడ్డి,తాళ్ళ రమేష్, పోటు శేఖర్,గంగిరెడ్డి లచ్చిరెడ్డి,మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య,ఆత్మకూరి కుమార్,శ్రీలక్ష్మి చౌదరి,కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు చీమల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్ మండపం వద్ద భజన,మహా అన్నదానం







**కాటారం,సెప్టెంబర్ 8 నవభూమి ప్రతినిధి:** కాటారం మండల కేంద్రం లోని ఏర్రగుంటపల్లె గ్రామంలో పెట్టిన గణేష్ మండపం వద్ద ఆదివారం గణపతి నవరాత్రి ఉత్సవాలలో రెండవ రోజులో బాగంగా 24 గంటల భజన( ఏకాహం) కార్యక్రమం నిర్వహించారు.రెండవ రోజు గణపతికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కల్లగుంట లక్ష్మి – వెంకటేశ్వర్లు దంపతుల ఆద్వర్యంలో మండపం వద్ద మహా అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గౌరోజు శ్రీనివాస్,కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు, భక్తులు,భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కాటారం మండలంలో ఘనంగా గణపతి

# నవరాత్రి ఉత్సవాలు

◆ గ్రామాల్లో వాడ వాడలా వెలసిన గణపతి విగ్రహాలు














**కాటారం,సెప్టెంబర్ 8 నవభూమి ప్రతినిధి:**కాటారం మండలం లో సుమారుగా అన్ని గ్రామాలలో ప్రతి వాడలో శనివారం రోజున వినాయకుని భారీ విగ్రహాలు ప్రతిష్టించి గణపతి నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. తేది.07/09/2024 శనివారం నుండి తేది.17/09/2024 సోమవారం రోజు వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు మండపాల నిర్వాహకులు తెలిపారు.మండపాల వద్ద ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్వామి వారిని ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు,సరస్వతి పూజలు,హెూమాలు, మహా అన్నదానాలు,నృత్యాలు, ఏకాహం భజన కార్య క్రమాలు,ఆర్కెస్ట్రా ప్రోగ్రాం లు తదితర కార్యక్రమాలతో ఈ తొమ్మిది రాత్రులు గణపతి మండపాల వద్ద సందడి నెలకోననుంది.ఎంతో భక్తి శ్రద్ధలతో గ్రామ ప్రజలు,భక్తులు గణపతి పూజ లో పాల్గొంటున్నారు.కాటారంలో భక్తాంజనేయ స్వామి దేవాలయంలో,ముదిరాజ్ కులస్థుల ఆద్వర్యంలో, ఆధర్శనగర్ కాలనీలో, గారెపల్లి లో హనుమాన్ దేవాలయంలో,అయ్యప్ప దేవాలయంలో,రెడ్డి గాండ్ల కులస్థుల ఆద్వర్యంలో,చింతకాని క్రాస్ రోడ్ లోని భక్తుల ఆద్వర్యంలో పాడి రమేష్ ఇంటివద్ద,శ్రీ లక్ష్మీ దేవర ఆలయంలో,గొల్ల వాడలో యాదవ సంఘం ఆద్వర్యంలో,రజక సంఘం ఆధ్వర్యం లో,ఎర్రగుంటపల్లి గ్రామంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మాచెర్ల సత్యం ఇంటివద్ద,ధన్వాడ లోని శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయంలో, బొప్పారం గ్రామం లోని రామాలయంలో,చిధినపల్లి హనుమాన్ టెంపుల్ లో,చింతకాని శ్రీ చెన్న కేశవ స్వామి దేవాలయంలో ఇలా ప్రతి ఊరిలో,ప్రతి వాడలో గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.గణపతి నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుపు కునేందుకు మండలం లోని ప్రజలు సిద్ధమయ్యారు.గ్రామాల్లో వాడ వాడలా గణనాథుడి మండపాలు ఏర్పాటు చేశారు.సర్వ విఘ్నాలను తొలగించే వినాయకుడు భక్తుల నుంచి పూజలందుకోనున్నాడు.ప్రతీ సంవత్సరం భాద్రపద మాసం శుక్లపక్ష చవితి రోజున దేశవ్యాప్తంగా ఈ పండగను అంగరంగ వైభవంగా ప్రజలు జరుపుకొంటారు.తొమ్మిది నుంచి పదకొండు రోజుల పాటు గణేశ్ ఉత్సవాలు కొనసాగనున్నాయి.ఆది దంపతుల (శివ,పార్వతులు) మొదటి కుమారుడ్కెన గణపతిని పూజించనిదే ఏ పనీ ప్రారంభించరు. వినాయక చవితి హిందువులకు తొలి పండుగ. భాద్రపద శుద్ధ చవితి రోజే గణనాథుడు పుట్టాడని పురాణాలు చెబుతున్నాయి. గణేషుడి ఆవిర్భావ గాథలు పురాణాల్లో రకరకాలుగా చెప్పబడ్డాయి. శివ పురాణం ప్రకారం..ఒకసారి పార్వతీదేవి స్నానం చేయడానికి శరీరానికి నలుగు పండిని రాసుకుంది. మిగిలిన నలుగు పండిని ఓ

బొమ్మను తయారు చేసి దాని ప్రాణం పోసింది.అతనిని ద్వారం దగ్గర కాపలాగా పెట్టింది.శివుడు లోపలికి వెళ్తుండగా ద్వారం దగ్గర బాలుడు అడ్డుకున్నాడు. ఇద్దరి మధ్య యుద్ధం జరిగింది. ఆగ్రహంతో శివుడు ఆ బాలుడి తలను త్రిశూలంతో నరికివేశాడు.తల తెగిపడి ఉన్న బాలుడిని చూసి పార్వతీ దేవి కన్నీరు మున్నీరైంది.పార్వతి దేవి బాధను చూడ లేక పోయిన శివుడు.. ఒక ఏనుగు తలను తీసుకొచ్చి అతికించి ప్రాణం పోశాడు.అతనికి గజాననుడు అని పేరు పెట్టాడు.తన కారణంగా ఆ బాలుడు వికార రూపాన్ని పొందాడని గజాననుడికి తొలిపూజ అందుకునేలా శివుడు వరమిచ్చాడు.దీంతో ప్రతీయేడాది భాద్రపద మాసంలో తొలి పూజను గణేశుడు అందుకుంటున్నాడు.











## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను అప్పగించిన కాటారం పోలీసులు



**కాటారం,సెప్టెంబర్ 8 నవభూమి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలో గల కాటారం గ్రామానికి చెందిన జిల్లల శ్రీశైలం వన్ ప్లస్ మొబైల్,గంగారం గ్రామానికి చెందిన చిట్యాల సమ్మయ్య పోకో మొబైల్,మల్లారం గ్రామానికి చెందిన దుర్గం రఘు రియల్మీ మొబైల్,కొర్లకుంట గ్రామానికి చెందిన కృష్ణ ఇంటెక్స్ మొబైల్ పోన్లు గత కొద్ది రోజుల క్రితం పోగొట్టు కోగా వీరంతా కాటారం పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసారు.వారు ఇచ్చిన మొబైల్ వివరాల ఆధారంగా సిఇఐఆర్ పోర్టల్ ద్వారా కాటారం పోలీసులు అనతి కాలం లోనే మొబైల్ ఫోన్లు వెతికి పట్టుకొని జిల్లెళ్ళ శ్రీశైలం,చిట్యాల సమ్మయ్య,దుర్గం రఘు,కృష్ణ లకు ఆదివారం రోజున కాటారం ఎస్ఐ మ్యాక అభినవ్ ఆద్వర్యంలో బాధితులకు అప్పగించారు.పోయిన సెల్ ఫోన్లను అనతి కాలం లోనే తిరిగి అప్పగించడం లో కాటారం పోలీస్ యంత్రాంగం చురుకైన పాత్రను పోషించిందని,కాటారం పోలీసులు త్వరితగతిన బాధితులకు సేవలు అందించడంలో చూపెడుతున్న చొరవను మండల ప్రజలు, వ్యాపారస్తులు కాటారం పోలీస్ లను ప్రశంసించారు.

## ‘వసూల్ రాజా’పై చర్యలకు రంగం

**నల్లగొండ, –నవభూమి:** మిర్యాలగూడ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని ఓ ఎస్ఐ అక్రమార్జన వ్యవహారంపై ‘ఆంధ్రజ్యోతి’లో శుక్రవారం ప్రచురితమైన ‘వసూల్ రాజా’ కథనం కలకలం రేపింది. ఈ కథనంలో పేర్కొన్న అంశాల ఆధారంగా సదరు ఎస్ఐ వ్యవహారశైలిపై ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆరా తీశారు. ఎస్పీ ఆదేశాల మేరకు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు సదరు పోలీసస్టేషన్‌ను సందర్శించారు. ఆ ఎస్ఐ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులు, కేసులు నమోదు చేయని వాటి వివరాలు, జనరల్ డైరీలో పేర్కొన్న అంశాలు, తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు కొన్ని ఫైళ్లను సీజ్ చేసి తీసుకెళ్లారు. డీఎస్పీ తన తనిఖీలో వెల్లడైన వివరాలను ఎస్పీకి నివేదించనున్నారు. అదే సమయంలో రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు సైతం ఈ కథనంపై ఆరా తీశారు. ఏ స్టేషన్, సదరు ఎస్ఐ వ్యవహార శైలి, వచ్చిన ఫిర్యాదులు, ఇతర ఆరోపణలపైనా ఇంటెలిజెన్స్ అధికారులు లోతుగా సమాచారం సేకరించినట్లు తెలిసింది. జిల్లా స్థాయి పోలీస్ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు కూడా అతడి వ్యవహారాలపై ఆరా తీసి సమగ్ర నివేదికను రూపొందించినట్లు సమాచారం. ఈ కథనం ప్రచురితమయ్యాక ‘ఆంధ్రజ్యోతి’ కార్యాలయానికి పలువురు ఫోన్‌చేసి మిర్యాలగూడ సబ్‌డివిజన్ పరిధిలోని జాతీయరహదారిపై ఉన్న మరో రెండు స్టేషన్ల పరిధిలోనూ ఇదే స్థాయిలో వ్యవహారాలు కొనసాగుతున్నాయని, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. చట్టాన్ని కాపాడి, న్యాయాన్ని రక్షించాల్సిన పోలీసులే అడ్డగోలుగా ముడుపులు తీసుకుంటూ అమాయకులను వేధిస్తున్నారని, అక్రమాలకు వత్తాసు పలుకుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు స్టేషన్ల కార్యకలాపాలపైనా జిల్లా పోలీసబాస్ దృష్టి సారించి విచారణ చేయిస్తే వారి ఆగడాలు వెలుగులోకి వస్తాయని బాధితులు మొరపెట్టుకున్నారు. ఇదిలా ఉండగా, డీఎస్పీ, ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి వచ్చే నివేదికల అనంతరం శాఖాపర చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సిద్ధమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది.

### భూదాన్ పోచంపల్లి వాడ వాడల

# కొలువుతీరిన గణనాథులు

- **నేతాజీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ గణనాథుడు**

**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి. సెప్టెంబర్ 08** బోధిధర్మ యోగా హెల్త్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథానికి పూజలు నిర్వహిస్తున్న సభ్యులు శనివారం వినాయక చతుర్దత్తి ని పురస్కరించుకొని మండల ,పట్టణ వ్యాప్తంగా వాడ వాడ వీధి వీధిన కన్నుల పండుగగా గణనాథులు కొలువు తీరారు. ఈ సందర్భంగా పురపాలక కేంద్రంలోని నేతాజీ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ గణనాథుడు తొలి పూజలు అందుకున్నాడు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గునిగంటి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బోధిధర్మ యోగా హెడ్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి గణపతికి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సీత భాస్కర్ ,శిక్షకురాలు కొయ్యడ సంధ్య ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. 101 యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ గణనాథుడి వద్ద ప్రత్యేక ఆకర్షణగా51 కేజీల లడ్డు సంస్థ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. టై అండ్ డై ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడు సంస్థ అధ్యక్షుడు భారత లవ కుమార్ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వటపత్ర గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడికి అధ్యక్షుడు గంజి యుగేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఉదయం నుండి ప్రజలు పురపాలక కేంద్రంలోని గణనాథుల కొనుగోలు, గణనాథుల కొనుగోలు, పూజా పత్రాల కొనుగోలు కోసం బారులు తీరారు.





# ఓ బొజ్జ గణపయ్య విఘ్నాలు తీర్చయ్యా

**నల్లగొండ):–నవభూమి:** సకలవిఘ్నాలు తొలగించే గణేశుడి నవరాత్రి ఉత్సవాలు శనివారం మొదలవనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ప్రత్యేక అలంకరణలతో మండపాలు సిద్ధంకాగా, వివిధ రూపాల్లోని వినాయక విగ్రహాలను మండపాలకు తరలించారు. శనివారం ఉదయం విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం ప్రత్యేక పూజలతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చల్లంగ చూడాలని, పలు కోర్కెల చిట్టాతో గణాధిపతుడిని వేడుకునేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు.ఇటీవల వరుణుడు కన్నెర్రజేయడంతో వరదలతో నష్టపోయిన తమను ఒడ్డున వేయాలని, ఈ ఏడాదైనా పంటలు పండి ధాన్యపురాశులతో గాదెలు నిండేలా కరుణించాలని అన్నదాతలు ప్రార్థిస్తున్నారు. ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు దిగిరావాలని సామాన్యులు, మధ్యతరగతి జీవులు వేడుకుంటుండ గా, ప్రభుత్వాలు తమ మొర ఆలకించి వేతనాలు పెంచాలని, పీఆర్‌సీ ప్రకటించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుతున్నారు. పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి అష్టకష్టాలు పడ్డామని, పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, తమకు గుర్తిం పు కలిగించేలా ప్రభుత్వ పెద్దల మనసు మారి పదవులిచ్చేలా విఘ్నేశుడు దయచూపాలని రాజకీయనేతలు వేడుకుంటున్నారు. ఈ ఏడాది కలిసివచ్చేలా ఆశీర్వదించాలని ప్రతిపక్షాల నాయకులు పూజించేందుకు సిద్ధమయ్యా రు. తొలి పూజలందుకునే గణేశుడుకి తమ మొర విన్నవిస్తే శుభఫలితం కలుగుతుందనే ఆశాభావంతో భక్తు లు ఈ గణేశ్ చతుర్థిని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.ధాన్యపురాశులు పండేలా ఆశీర్వదించు స్వామీ కరువుతో గత ఏడాది వర్షా లు లేక, సాగునీరందక పంట లు ఎండి, వేసిన పైర్లు చేతికంద క నష్టపోయిన రైతాంగం ఈ ఏడాది పంటలు బాగా పండి, ధాన్యపురాశులు నిండేలా ఆశ్వీరించాలని కోరుకుంటోంది. ఇటీవల వర్షాల ప్రభావంతో ఏర్పడి న నష్టం నుంచి బయటపడేసి పంటలు చేతికందేలా ఎలాంటి విఘ్నాలు లేకుండా చూడాలని రైతులు ప్రార్థిస్తున్నారు.పదవుల యోగం కల్పించు స్వామి గణేశుడి చల్లని చూపులతో పదవీయోగం కల్పించాలని పలువురు అధికారపార్టీ నేతలు ప్రార్థిస్తున్నారు. పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి ప్రజాసమస్యలపై పోరాడామని, ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేశామని, తమ కష్టాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించేలా విఘ్నేశ్వరుడు ప్రేరణ కల్పించి పదవీయోగం కల్పించాలని ఆశావహులు ప్రార్థన చేస్తున్నారు. గత ఏడాది ఆశించిన ఫలితాలు దక్కించుకోలేకపోయామని, తమ కష్టాన్ని గుర్తించి ప్రజలు మద్దతుగా ఉండేలా ఆశీర్వదించాలని తొలి పూజలందుకునే గణేశుడిని ప్రతిపక్ష నాయకులు వేడుకుంటున్నారు.చుక్కలనంటిన ధరలను తగ్గించు దేవా..కూరగాయలు, వంటనూనెలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటడంతో మూడుపూటలా కడుపునిండా భోజనం కూడా చేయలేని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. ఈ ధరలను దించి గణేశుడు దయచూపాలని మధ్యతరగతి, సామాన్యులు వేడుకుంటున్నారు. చారెడు జీతం, బారె డు ఖర్చులతో జీవనం గడ్డుగా మారిన పరిస్థితుల నుంచి ఒడ్డున పడేయాలని కోరుతున్నారు.కాలుష్యరహితంగా వేడుకలు నిర్వహించాలి లోక కల్యాణం కోసం నిర్వహించే వినాయకచవితిని కాలుష్యరహితంగా నిర్వహించేలా ఏటా ప్రజల్లో చైతన్యం పెరుగుతోంది. గణేశ్ విగ్రహాల ప్రతిష్ఠ లో పీవోపీ (ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్) ప్రతిమల స్థానంలో మట్టిగణపతి విగ్రహాల ను ప్రతిష్ఠించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. పలు స్వ చ్ఛంద సంస్థలు, జనవిజ్ఞానవేదిక లాంటి సంస్థలు మట్టివినాయకుల ఆవశ్యకత ను, పీవోపీ బొమ్మలతో ఏర్పడే కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్నాయి. ప్రధానంగా పీవోపీ గణేశ్ ప్రతిమలతో నీటి కాలుష్యం ఏ స్థాయిలో ఉంటుంద నే అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే అంతంతమాత్రంగానే జలవనరులు ఉన్న జిల్లాలో పీవోపీతో తయారుచేసిన గణేశ్ ప్రతిమలు ఎంతో హానికరమైనవని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, సింథటిక్ కలర్స్‌తో చేసిన విగ్రహాలను చెరువు ల్లో, నదుల్లో కలపడం వల్ల (నిమజ్జనం చేయడం)ఆ జలాలు కలుషితమవుతున్నాయని పేర్కొంటున్నారు. ప్రధానంగా పీవోపీలో 300 డిగ్రీల ఫారెన్‌హీట్ వద్ద జిప్సంను వేడి చేసి తయారు చేస్తారని, ఇది నీటిలో కలిసినప్పుడు మళ్లీ జిప్సంగా మారుతుందని, ఇది చాలా ప్రమాదకరమని పేర్కొంటున్నారు. మరోవైపు విగ్రహాలకు రంగులు వేస్తున్న కలర్‌లో విషపూరిత భారీ లోహాలుంటున్నాయని, ఇవి కూడా పర్యావరణానికి హాని చేస్తున్నాయని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆవేదన చెందుతున్నారు. పీవోపీ విగ్రహాల తయారీలో ఉపయోగించే కలర్‌లో జిప్సమ్, సల్ఫర్, పాస్ఫరస్, మెగ్నీషియం, మెర్క్యూరీ, లెడ్, కాడ్మియమ్, ఆర్సెనిక్, కార్బన్, వంటి రసాయనాలతో క్యాన్సర్ సోకే ప్రమాదముందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వినాయక విగ్రహాలను కాలుష్యరహిత బంకమట్టితో, సహజ రంగులైన పసుపు, కుంకుమ, గంధం, బియ్యంపొడితో తయారుచేసుకోవాలని సూచిస్తున్నారు.

